క్లుప్తంగా

ఐఎంఎఫ్ఎల్ డిపోలో వన సమారాధన


ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న డిపో మేనేజర్, హమాలీలు

సామర్లకోట: కార్తిక మాసం సందర్భంగా స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో గురువారం వన సమారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎగుమతి, దిగుమతి హమాలీల సంఘ రాష్ట్ర కార్యదర్శి వి.కొండలరావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, వి.అప్పలరాజు ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. డిపో మేనేజర్, ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు. డిపో ఆవరణలో ఉన్న రావి, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో మద్యం కంపెనీల ఏజెంట్లు కూడా పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వృద్ధుడికి పింఛను అందజేత


కాకినాడ ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ చిన్నారి

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ పింఛను కానుకలో వలంటీర్లు అందిస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛను లబ్ధిదారుడు మాగాపు సత్యనారాయణ కొంతకాలంగా కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పింఛను తీసుకునేందుకు చివరి రోజు కావడంతో, అతని వలంటీర్ కాండ్రకోట చిన్నారి చొరవ చూపి, సొంతఖర్చుతో కాకినాడకు వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న సత్యనారాయణకు పింఛను అందజేశారు. చిత్తశుద్ధితో వలంటీర్ చిన్నారి చూపించిన చొరవ.. పలువురి మన్ననలు పొందింది.

సిద్ధపాటు క్రిస్మస్‌ను విజయవంతం చేయండి

పిఠాపురం: పిఠాపురం ఆంధ్రా బాప్టిస్ట్ సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో సిద్ధపాటు క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు పాస్టర్లు గుబ్బల సాల్మన్‌రాజు, బి థియోఫిలాస్‌లు తెలిపారు. పిఠాపురం ఆంధ్రా బాప్టిస్ట్ సెంటినరీ చర్చితో పాటు పిఠాపురం బాప్టిస్ట్ ఫీల్డు కౌన్సిల్, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి పాస్టర్ల ఫెలోషిప్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ వేడుకలకు నియోజకవర్గ క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌జీఓ సంఘ కార్యాలయం ప్రారంభం

పెద్దాపురం: సంఘ సభ్యులంతా ఏకతాటిపై వచ్చి ఎన్‌జీఓ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి తూర్పుగోదారి జిల్లా ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ అన్నారు. స్థానిక ఎన్‌జీఓ సంఘ కార్యాలయాన్ని గురువారం వారు ప్రారంభించారు. సంఘం అధ్యక్షుడు డీడీ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు.

నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ప్రవీణ

పెద్దాపురం: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నాడు-నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తోందని ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ అన్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో గురువారం నాడు-నేడు పథకంపై సీడీపీఓ ఉష అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. పీడీ ప్రవీణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీహెచ్‌ఆర్ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్పీ ప్రదీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమాదేవి, నిర్మలకుమారి, చంద్రకళ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తీరంలో మందుబాబుల హవా

కొత్తపల్లి: ఆహ్లాదకరమైన సాగరతీరంలో సేద తీరేందుకు వస్తున్న పర్యాటకులు మందుబాబుల ఆగడాలకు బెంబేలెత్తిపోతున్నారు. ఉప్పాడ సాగర తీరం, ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో రాత్రి-పగలు తేడా లేకుండా ఎక్కడ చూసినా మందుబాబులే దర్శనమిస్తున్నారు. పర్యాటక శాఖ, పోలీసుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతోందని పర్యాటకులు అంటున్నారు. మద్యం సీసాలను పగులగొట్టి తీరంలో వేయడం వల్ల పర్యాటకులకు తీవ్రగాయాలవుతున్నాయి. చీకటి పడితే బీచ్ రోడ్డులో ప్రయాణించాలంటేనే ప్రయాణికులు హడలెత్తుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు


మర్లావలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మర్లావ గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైస్ ఎంపీపీ మిరియాల రాజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించినది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని కోరారు. ప్రభుత్వం ఆవిర్భవించినప్పటి నుంచి ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. తొలుత పార్టీ జెండా, పథకాల బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఇనకొండ వీర విష్ణుచక్రం, కామన రామకృష్ణ, నల్లల గోవిందు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, పంచాయతీ కార్యదర్శులు నిర్మల, బషీర్ పాల్గొన్నారు.

దవులూరి పాదయాత్రకు స్పందన

పెద్దాపురం: ముఖ్యమంత్రిగా 2024లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరుతూ ఏడు పర్యాయాలు నిర్వహించే పాదయాత్రలో భాగంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు రెండో రోజు గురువారం కొనసాగించిన యాత్రకు మంచి స్పందన లభించింది. సామర్లకోట నుంచి పెద్దాపురం మండలం తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి సుమారు 15 కి.మీ. మేర పాదయాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సామర్లకోట వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఇనకొండ వీర విష్ణుచక్రం, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి పాదయాత్రను చేపట్టారు. ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వేద పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ప్రజా సేవలో మరో 20 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలంటూ స్వామివారికి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సాధించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కులం, మతం, వర్గ బేధాల్లేకుండా సంక్షేమ పాలన అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దూది రాజు, సర్పంచ్‌లు కనపర్తి చీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి, ఉప సర్పంచ్‌లు వాసిరెడ్డి శ్రీనివాస్, గోలి రామారావు, తుమ్మల అచ్యుతరామయ్య, లక్కాకుల కృష్ణ, నాగబోయిన రాజుబాబు, నరాలశెట్టి త్రినాథ్, నేతల హరిబాబు పల్లా శ్రీనివాస్ యాదవ్, వల్లూరి కుట్టయ్య చౌదరి, ఒబిలిశెట్టి ఆనందం, కాశీవిశ్వనాథ్, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


సామర్లకోట 11వ వార్డులో పథకాల బోర్డును ఆవిష్కరించిన చైర్‌పర్సన్ తదితరులు

సంక్షేమ ఫలాలు చేరువ చేసేందుకే..

సామర్లకోట : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు మరింత చేరువ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 11వ సచివాలయ పరిధిలో సత్యనారాయణపురం రామాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమం ముగిశాక వారం రోజుల్లో ఆయా పథకాలకు ఈ-కేవైసీ అప్‌డేట్ చేస్తామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సేపెని సురేష్, పితాని కృష్ణ, జట్ల మోహన్, జేసీఎస్ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.


పొన్నాడలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షేమ సారథి జగన్

కొత్తపల్లి: నాలుగున్నరేళ్ల జగనన్న పాలన, గత చంద్రబాబు పాలనలో తేడాను గమనిస్తే సంక్షేమ సారథిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలవగా, దోపిడీ దొంగలకు సారథిగా చంద్రబాబు నిలిచారని స్పష్టమవుతోందని ఎంపీపీ కారే సుధా అన్నారు. మండలంలోని పొన్నాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ జెండాలను పంపిణీ చేశారు. కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడు బండి దావీదు, మండల వ్యవసాయ అడ్వైజర్ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉమ్మిడి చిన్న, తిత్తి ధనరాజు, ఉమ్మిడి అప్పారావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈవీఎంలపై అవగాహన

పిఠాపురం: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి నియోజకవర్గంలో ఓటర్లకు ఈవీఎంలు వీవీ ప్యాట్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్టు ఎన్నికల అధికారి కె.సుబ్బారావు తెలిపారు. నియోజకవర్గంలో 242 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిదిలోను ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి నియోజకవర్గంలో ప్రత్యేక వాహనాల ద్వారా అవగాహన కలిగించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. పిఠాపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పరిసర వార్డు సచివాలయాల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలు 3 నెలల పాటు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. కార్తిక మాసం స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర గురువారం ఉదయం వరకూ ఉండటంతో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలిపూజ, తొలి అభిషేకాలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలిపూజ జరిగింది. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకాలంకరణలు చేశారు.

ఎమ్మెల్యే ఆదేశాలను పట్టించుకోరా?

- రహదారి నిర్మాణానికి మూడు నెలలా?
- అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ కౌన్సిలర్లు

పిఠాపురం: పనులు 15 రోజుల్లో పూర్తి చేయండని ఎమ్మెల్యే ఆదేశించినా పట్టించుకోపోతే ఎలా అని అధికారులను కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. 6వ వార్డు కౌన్సిలర్ గొల్లపల్లి అచ్యుతాంబ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని, ఎమ్మెల్యే దొరబాబు ఇచ్చిన హామీలకు నిధులు ఇచ్చి పనులు చేయాలని ఆదేశాలు ఇస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. 6వ వార్డులో 15 రోజుల్లో రోడ్డు వేయాలని ఆదేశించి మూడు నెలలు కావస్తున్నా పట్టించుకోలేదని ఆయన ఆదేశించారు. గతంలో ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో 6వ వార్డుకు ఏ విధమైన పనులు చేయలేదని ఇప్పుడు అధికారంలోకి వచ్చాకా కూడా చేయకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. వచ్చే సమావేశం లోపు పనులు పూర్తి చేయకపోతే తాను సమావేశంలో కింద కూర్చుని నిరసన తెలుపుతానని ఆమె అధికారులను హెచ్చరించారు. ఉమర్ ఆలీషా ఆశ్రమానికి ప్రభుత్వ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు తెడ్లపు అలేఖ్యారాణి, గంధం నాగేశ్వరరావు కమిషనర్ సత్యనారాయణ పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

పెద్దాపురం: దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించినట్టు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో 2008లో కళాశాలను స్థాపించినట్టు పేర్కొన్నారు. ఉన్నత స్థాయి సిబ్బంది ప్రోత్సాహం, స్థానికుల సహకారం, విద్యావేత్తగా తనకున్న అనుభవంతో తొలుత నాక్ 'ఎ' గుర్తింపు పొందామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలను విద్యాపరంగా మరింత అభివృద్ధి చేసి, సిబ్బంది కృషితో కళాశాలకు అటానమస్ గుర్తింపు పొందామని వివరించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి 2033-34 వరకు పదేళ్ల పాటు ఈ గుర్తింపు కళాశాలకు ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.గిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ సర్వరామేశ్వరుడు, హెచ్ఓడీలు బి.వీరేంద్ర, పీవీ రమణ, ఈ.అప్పారావు, డాక్టర్ సీహెచ్ సుబ్బారావు, మణికంఠ, శ్యాంబాబు, పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పట్టణ పాలన

- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ మంగతాయారు, వైస్ చైర్మన్ ప్రసాద్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ కౌన్సిల్ పాలన సాగిస్తోందని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు గురువారం వారు భూమిపూజ చేశారు. కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్టు పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వివరించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పట్టణంలో అవసరమైన డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలను ముమ్మరం చేశామన్నారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వారన్నారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ముమ్మన ప్రకాష్, డీఈ ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన జగన్

- ఇళ్ల స్థలాల కేటాయింపు సభలో దొరబాబు


బ్రహ్మానందపురంలో లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: నిర్వాసిత పేదలకు సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం అచ్చంపేట, గొంచాల గ్రామాల్లో లబ్ధిదారులకు బ్రహ్మానందపురంలో ఇళ్ల స్థలాల కేటాయింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టాల ప్రకారం లబ్ధిదారులకు బ్రహ్మానందపురం లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను రెవెన్యూ అధికారులు చూపించారు. దొరబాబు మాట్లాడుతూ అచ్చంపేట ఏడీబీ రోడ్డుకు అత్యంత సమీపంలో ఉన్న ఈ విలువైన స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంత పెద్ద స్థాయిలో ఏ ముఖ్యమంత్రి ఇంటి స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రుణాన్ని ఎన్నికల్లో తీర్చుకునేలా అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, గొంచాల సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, అచ్చంపేట సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎంటీఎస్‌ల శిక్షణ


శిక్షణ ఇస్తున్న అదనపు కమిషనర్ కృష్ణమోహన్

సామర్లకోట: మాస్టర్ ట్రైనర్లుగా ఎంపికైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో నాలుగు రోజుల పాటు జరిగిన శిక్షణ గురువారంతో ముగిసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరిసీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల వారికి రెండు బ్యాచ్‌లుగా 240 మందికి శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు కమిషనర్ ఇ.కృష్ణమోహన్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ఎంటీలు ఆయా మండలాల్లో సచివాలయ సిబ్బందికి డిసెంబర్ 4 నుంచి 9 వరకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్ డీడీ రాజ్యలక్ష్మి, ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, శ్రీదేవి, నిహారిక పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం అభివృద్ధి



అజెండా అంశాలకు ఆమోదం తెలుపుతున్న కౌన్సిలర్లు.. సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

- రూ.40 లక్షల అంచనాకు తీర్మానం
- కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలన్నీ ఏకగ్రీవ ఆమోదం

సామర్లకోట: మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కాపు కల్యాణ మండపాన్ని రూ.40 లక్షలతో అభివృద్ధి చేయడానికి కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. గురువారం చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాన్ని ప్రారంభించి, చేతులు దులుపుకోవడంతో కల్యాణ మండపం కాస్తా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఈ క్రమంలో కల్యాణ మండపం అభివృద్ధి చేయడానికి రూ.40 లక్షలతో అంచనా రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ నిధులు కోరడానికి ఏకగ్రీవంగా తీర్మానించారు. ముఖ్యమంత్రి జగనన్న కాలనీ ప్రారంభించడానికి వచ్చిన సమయంలో చేసిన ఖర్చులను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలుగుదేశం కౌన్సిలర్ బలుసు వాసు ఈ ఖర్చులపై డీసెంట్ తెలిపారు. సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయకుండా, జిల్లా కలెక్టరు నుంచి ఖర్చులు ఎందుకు రాబట్టలేదని అధికార పక్ష కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ ప్రశ్నించారు. ఖర్చు చేసిన తర్వాత వాటిని జిల్లా కలెక్టరుకు పంపుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ తెలిపారు. రెండో వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, కమిషనర్ జె.రామారావు, మేనేజరు అచ్యుతరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీశంకరుల ఉత్సవాలు


గౌరీదేవిని సారెతో సాగనంపుతున్న భక్తులు

కొత్తపల్లి: సారెతో సాగనంపడంతో గౌరీ శంకరుల మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్థానిక బీటు వీధిలో నెల రోజులుగా తెలుగింటి ఆడపడుచు, ఆరాధ్య దైవంగా భావించే గౌరీశంకరులను గురువారం మేళతాళాలు, బాజాభజంత్రీల మధ్య ఊరేగింపుతో ఘనంగా సాగనంపారు. చేనేత కార్మికుల ఆడపడుచు అయిన గౌరీదేవిని సారెతో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేస్తారు. ప్రతిష్ఠించిన దగ్గర నుంచి ప్రతి రోజు వివిధ వేషధారణలతో భక్తులను ఎంతగానో మెప్పించారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిచారు.

అలరించిన కళారూపాలు

కొత్తపల్లి: మండలంలో మూలపేటలో గౌరిదేవి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన వేషాలు అలరించాయి. ఇందులో భాగంగా గునపం పోటు వంటి అంశాలను ప్రదర్శించారు. వేషాల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో మూలపేట గ్రామం కిక్కిరిసి పోయింది. పట్టుశాలీ సంఘం సభ్యుల పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర


పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని అమినాబాద్, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పలు శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు 17 సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈఓపీఆర్డీ భాస్కరరావు, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని మహారాణి కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్య చౌదరి అన్నారు. ప్రభుత్వాస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం హెచ్ఐవీపై మహారాణి కళాశాల, రాజరాజేశ్వరి ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వైజ్ మేనేజర్ రాజు, కళాశాల అధ్యాపకులు ఏసుబాబు, తాతాజీ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కంబాల నారాయణరావు

పిఠాపురం: ప్రతి హిందువు హిందూ ధర్మ రక్షణే జీవిత లక్ష్యంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సహాయ కన్వీనర్ కంబాల నారాయణరావు పిలుపు నిచ్చారు. పిఠాపురం సూర్యారాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా హిందూ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రతి మండల కన్వీనర్లు గ్రామ కన్వీనర్ల ద్వారా హిందు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. శాంతిని కోరే మన దేశంలో విదేశీ మతాలు వ్యాప్తి చెంది భారతీయ సంస్కృతిని సంప్రదాయాలను నాశనం చేస్తున్నాయని, వాటిని ప్రతి ఒక్కరు అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. గోదావరి విభాగ ప్రచార ప్రముఖ్ నందూరి కృష్ణ, గోదావరి విభాగ వ్యవస్థాపక ప్రముఖ్ పెమ్మిరాజు రామచంద్రరావు, జిల్లా ప్రచారక్ పడాల రఘు మహిళా విభాగం ప్రముఖ్ అదట్రా వరహాలబాబు, జిల్లా దేవాలయాల జట్టు సభ్యులు కొప్పన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న సిరి ధాన్యాల సాలగ్రామాలు, డ్రైఫ్రూట్స్, నవ ధాన్యాలు, మసాలా దినుసులతో తీర్చిదిద్దిన శివలింగాలు

సిరి లింగాలు



పిఠాపురం: పిఠాపురంలో బ్రహ్మకుమారీస్ రాజయోగ సెంటర్‌లో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సిరిధాన్యాల శివలింగాలు భక్తులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం స్థాపించి 87 సంవత్సరాలు అయిన సందర్భంగా సిరి ధాన్యాలు, డ్రైఫ్రూట్స్, నవ ధాన్యాలు, మసాలా దినుసులతో చేసిన 87 రకాల శిలింగాలు, సాలగ్రామాలు భక్తులకు దర్శనమిస్తున్నాయి. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు దర్శనం కల్పిస్తున్నారు.